‘‘అయినా నన్ను వదిలేసి ఎక్కడికి పోదామని? ఉజ్జోగమా? సజ్జోగమా? ఎలా బతికేస్తుంది?’’ అన్నాడు.

‘‘ఆ బెంగ మీకనవసరం’’ అన్నది రాధిక నెమ్మదిగా.

‘‘చూడమ్మా .. మా దగ్గరికి వద్దామని అనుకుంటున్నావేమో! ఒక్క మాట విను. నువ్విలా చేస్తే మీ అల్లుడికి నీ మీదా, నా మీదా గౌరవం ఉంటుందా!? చెప్పు!’’ అన్నది మహి.

‘‘నీ కోడలికి మాత్రం ఏం చెప్పగలవు అమ్మా. తనకు, పిల్లలకూ నీమీద పిసరంత గౌరవం ఉంటుందా?’’ అన్నాడు శేఖర్.

‘‘నేను ఎక్కడికీ రాను. ఈ ఇంట్లోనే ఉంటాను..’’ స్థిరంగా అన్నది రాధిక.

‘‘హమ్మో.. ఎంతకు తెగించింది చూశార్రా! ఈ ఇల్లు దాని పేర రాశాననా.. అంటే నన్ను గెంటేస్తావా?’’ అని అరుస్తూ మాధవరావు కుర్చీ విసిరి సర్ర్.. మని పైకి లేచాడు. ఆ పక్కనే ఉన్న పేపర్ వెయిట్‌తో టీపాయ్ మీద గట్టిగా మోది, కోపంగా విసిరి కొట్టాడు. ఆ ధాటికి టీపాయ్ గ్లాస్ కాస్తా భళ్లున పగిలిపోయింది. అదే విసురుతో రాధికపైనా చెయ్యెత్తాడు. పిల్లలిద్దరూ తండ్రిని వారించారు.

‘‘అడ్డుకున్నారేం? కొట్టనివ్వండి’’ అన్నది రాధిక తాపీగా.. నాప్‌కిన్‌తో చేతులు తుడుచుకుంటూ.

శేఖర్, మహి బిత్తరపోయారు.

‘‘తిట్టినప్పుడు ఏనాడూ అడ్డుకోని మీరు.. కొట్టినప్పుడు మాత్రం ఎందుకు అడ్డుకోవాలి? ఆయన మాత్రం ఎన్ని దెబ్బలని వేయగలరు? ఓ నాలుగు వేసి ఊరుకుంటారు. నేనూ తిని ఊరుకుంటాను. కానీ తిట్లు అలా కాదే! ఘడియ ఘడియకూ వినాలి. వింటూనే ఉండాలి. కొన్నిటికి నా దగ్గర సమాధానం ఉన్నా తిరిగి మాట్లాడకూడదు. మాట్లాడితే మళ్లీ ఆ తిట్ల పురాణం కాస్తా మరింత పొడుగైపోతుంది. అందుకే దెబ్బలే నయం. వెయ్యనివ్వండిరా’’ అన్నది.

‘‘అమ్మా.. నాన్న గురించి నీకు తెలుసు కదా. కోపం ఎక్కువ. అయినా ఇన్నాళ్లూ బాగానే ఉన్నావు. ఈ రోజు తిట్లు బాధపెడుతున్నాయా?’’ అనడిగాడు శేఖర్.

ఆ మాటలకు పకాలున నవ్వింది రాధిక.



‘నమస్తే తెలంగాణ, ముల్కనూరు ప్రజాగ్రంథాలయం’ సంయుక్తంగా నిర్వహించిన ‘కథల పోటీ-2022’లో రూ.2 వేల బహుమతి పొందిన కథ.

‘‘అవున్రా! ‘ఈ పిచ్చిముండ కొంప ముంచిందిరా’ అని మీ నాన్న అనగానే.. నువ్వు ఆ పిచ్చి ముండ ఎవరా!? అని ఒక్క క్షణం ఆలోచించావా? లేదే.. వెంటనే ‘అమ్మ ఏం చేసింది నాన్నా?’’ అని అడిగావు. అంటే నా పేరు రాధిక కాదు.. పిచ్చి ముండ. అంతే కదా?’’.

తల్లి మాటలకు తల దించుకున్నాడు శేఖర్.

‘‘ఓకే.. ఓకే.. మీకే అంతగా అలవాటైపోయిన ఆ తిట్లు నన్నెందుకు ఇప్పుడు కొత్తగా బాధ పెడుతున్నాయని కదా ఇప్పుడు ప్రశ్న? అంతేనా మహీ? ‘ఏమ్మా! ఎందుకిలా చేశావ్?’ అని నన్ను అడిగావు. బాగానే ఉంది. ‘పిచ్చి ముండ అని ఎందుకు పదేపదే అమ్మను తిడతావ్ నాన్నా?’ అని ఎప్పుడైనా అడిగావా నువ్వు!?’’.

అమ్మ సూటి ప్రశ్నతో మహి కళ్లలో నీళ్లు తిరిగాయి.

‘‘సరే.. సూటిగా విషయానికొద్దాం!’’ అంటూ చెప్పడం ప్రారంభించింది రాధిక.

‘‘నేను ఇన్నాళ్లూ బాగానే ఉన్నాను. ఆయన్ని నిలదీయలేదూ అంటే అర్థం.. ‘నేను పిచ్చిముండనని, తెలివితక్కువ దాన్నని, నాకేమీ అర్థం కాదని’ అంగీకరించానని కాదు. నన్ను మా నాన్న ఉయ్యాల్లో వేసి ముద్దుగా తొలి సారి ‘రాధమ్మా!’ అని పిలిచాడట. ఆ పిలుపే నాకు 18 ఏళ్లవరకూ వినిపించింది. ఉదయం లేచిన దగ్గర్నుంచి రాత్రి పడుకునే వరకూ నా పుట్టింట్లో నేను రాధమ్మనే. రాధిక అని కూడా నన్నెవ్వరూ పిలిచేవారు కాదు. కానీ ఇప్పుడు ఆ పేరే మరచిపోయాను’’..

‘‘పెళ్లయి, ఇన్నేళ్లూ బాగానే ఉన్న నాకు ఇప్పుడెందుకు సడన్‌గా కోపం, బాధా, ఆత్మాభిమానం పొంగుకొచ్చాయి అనేగా మీ సందేహం? అదీ చెబుతాను. అప్పుడూ, ఇప్పుడూ, ఎప్పుడూ నాకు ఆత్మాభిమానం ఉంది. కానీ నాడు, నా తలనిండా బాధ్యతలు నిండి ఉన్నాయి. మీ నాన్నను ప్రశాంతంగా ఆఫీసుకు పంపాలి. మిమ్మల్ని చదువులకు పంపాలి. పెళ్లిళ్లు చెయ్యాలి. మీ పిల్లలను చూడాలి. ఇలా అప్పుడు నా అవసరం అందరికీ ఉంది. అందుకే నోరెత్తలేదు’’ అన్నది.

‘‘ఇప్పుడు లేదా బాధ్యత’’ అరిచాడు మాధవరావు.

‘‘లేదు.. ఉన్నా నేను నిర్వర్తించలేను’’ అని ఇల్లు అదిరిపోయేలా ఒకే ఒక్కమాట గట్టిగా చెప్పింది రాధిక.

మాధవరావు నోటమాట రాలేదు.

రాధికే మళ్లీ మాట్లాడటం మొదలుపెట్టింది.

‘‘నాన్న రిటైర్ అయ్యారు. ఇప్పుడు ఆయనకు జాబు బాధల్లేవు. టెన్షన్లు లేవు. 24 గంటలూ ఇంట్లోనే ఉంటున్నారు. మరి నాకు? నాకు కూడా అంత హడావుడి, ఇతర టెన్షన్లు ఉండకూడదు కదా? ఇద్దరం హాయిగా తీరిగ్గా లేచి, నవ్వుతూ ఆనందంగా గడపాలి కదా. కానీ అలా లేదు జీవితం. నాకు మునుపటి కంటే డబుల్ టెన్షన్ వచ్చి పడింది. ఇది నేను ఊహించనిది కాదు. ఒకప్పుడు ఆయన సెలవు రోజనో, ఒంట్లో కాస్త నలతగా ఉండో ఇంట్లో ఉంటే నా మనసు ఉప్పొంగిపోయేది. వారికి ఇష్టమైనవన్నీ చేసి పెట్టాలని ఉత్సాహం ఉవ్విళ్లూరేది. హడావుడిగా చేసి పెట్టేదాన్ని. కానీ ఏరోజూ నన్ను ఆయన ప్రశాంతంగా ఉండనివ్వలేదు.

మరి ఇప్పుడైతే పొద్దున లేచిన దగ్గర్నుంచి ఆయన నిద్రపోయే వరకు, నాకు ఇంటి సూత్రాలు చెబుతూనే ఉంటారు. ‘కూరలో కాస్త ఇంగువ దట్టించమని ఎన్నిసార్లు చెప్పాను నీకు? పెళ్లయి ఇన్నేళ్లయినా వంటరాదే నీకు’ అంటారు. ఆ కూరలో ఇంగువ వేశాను. కూర బాగుంది కూడా. కానీ ఆయన సలహా అది. ఓ రోజు బట్టలన్నీ కింద వేసి, వేరుచేసి ఉతికేందుకు సిద్ధం చేస్తున్నా. ఇంతలో గ్యాసు బండ రావడంతో అటు వెళ్లాను.. అంతే! ‘బట్టలన్నీ కింద పడేశావ్. కొంప కొల్లేరులా ఉంచుతావ్! నీకు ఇల్లు సర్దడం చేతకాదు’ అంటూ ఆ గ్యాసువాడి ఎదుట అరుపులు.

‘అన్ని నీళ్లు పోస్తే మొక్క ఎందుకూ పనికి రాకుండా చస్తుంది. తెలుసుకో!’.. పొద్దున్నే మొక్కలకు నీళ్లు పోస్తుంటే సుప్రభాతం మొదలుపెడతారు. మన పెర